క్లుప్తంగా

ఉప్పల్ గౌడ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక




అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ గ్రామ గౌడ కులస్తులు సోమవారం స్థానిక రేణుకా ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొనగాని శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కొండ తిరుపతిగౌడ్, కార్యవర్గ సభ్యులుగా గుండవేని సదయ్యగౌడ్, బుర్ర ప్రభాకర్‌గౌడ్, బొనగాని కుమార్‌గౌడ్, నేరెళ్ల రాజయ్యగౌడ్, దేశిని రాజేందర్‌గౌడ్, బుర్ర రవిగౌడ్, కొండ లచ్చన్నగౌడ్ ఎన్నికయ్యారు.

సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం



చెరువు వద్ద డోజర్‌తో చదును చేయిస్తున్న కార్యదర్శి రత్నాకర్

శాయంపేట : మండల కేంద్రంలోని తాళ్లకుంట చెరువు వద్ద మంగళవారం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తెలిపారు. సోమవారం స్థానిక చెరువు వద్ద ట్రాక్టర్ డోజర్ సాయంతో చదును చేయించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ సర్పంచ్ మాధవరెడ్డి

వేలేరు : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని మాజీ సర్పంచ్ మాధవరెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఇట్టబోయిన కుమార్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో రూ.13,500 విలువైన చెక్కును సోమవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ సూత్రపు సంపత్, నాయకులు ఫరూక్, సంపత్, అశోక్, కిరణ్‌పాల్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బెస్ట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు అందజేత



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కందగట్ల గణేశ్‌ను జటాధర ఎడ్యుకేషన్ టెక్నాలజీ హైదరాబాద్ వారు స్టేట్ బెస్ట్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డును సోమవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మైగేట్ సీఈఓ అనీష్ ఆంటోని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పని చేస్తున్నానని, మూడు దశాబ్దాలు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు నేర్పాలని, సబ్జెక్టును ప్రేమతో విద్యార్థులకు బోధిస్తే విద్యార్థులు కూడా అంతే ప్రేమతో నేర్చుకుంటారని అన్నారు. తనకు వచ్చిన అవార్డును తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, సహోధ్యాపకులకు, విద్యార్థులకు అంకితమిస్తున్నానని తెలిపారు.

బతుకమ్మ వేళ.. విద్యుత్ అంతరాయం

పరకాల: సద్దుల బతుకమ్మ పండుగ రోజున పలుమార్లు పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ నిలిచిపోగా.. మళ్లీ బతుకమ్మ ఆడుతున్న సమయంలో 5 నిమిషాల పాటు విద్యుత్ నిలిచిపోయింది. దీంతో ఒక్కసారిగా పరకాల పశువుల సంతలో మహిళలు ఆందోళనకు గురయ్యారు. ఆలస్యం కాకుండా విద్యుత్ అధికారులు అప్రమత్తమై విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరించారు. అయినప్పటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వీడియోలను బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టు చేసి, రేవంత్ పాలన అంటే ఇలాగే ఉంటుందంటూ విమర్శలు చేశారు.

గౌరమ్మా.. వెళ్లి రావమ్మా



జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా తరలివెళ్లి ఆయా గ్రామాల్లోని చెరువు గట్లు, కుంటలు, వాగుల వద్ద ఆనందోత్సాహాలతో బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడారు. పిండి వంటలతో తయారు చేసిన వాయినాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను, గౌరమ్మ తల్లిని 'వెళ్లి రావమ్మా' అంటూ కొలుస్తూ ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. పరకాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ, సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షించారు. కమలాపూర్‌లో కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి హాజరై ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరు : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పరకాల : మల్లక్కపేటలో బతుకమ్మలతో చిన్నారులు



ఆత్మకూరు : బతుకమ్మలతో వస్తున్న మహిళలు



పరకాల : భారీ బతుకమ్మతో వస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



కమలాపూర్ : మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ప్రణవ్, ఝాన్సీరాణి



దామెర : ఊరుగొండ బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు



పరకాల : పట్టణంలో ఆడుతున్న మహిళలు



ఐనవోలులో..



పరకాల : పశువుల సంతలో..



ఐనవోలు : బతుకమ్మలతో తల్లికూతురు



పరకాల : బతుకమ్మలతో వస్తున్న మహిళలు



శాయంపేట : గంగిరేణిగూడెంలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు, యువతులు, చిన్నారులు



దామెర : దమ్మన్నపేటలో..



నడికూడ : బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు



ఆత్మకూరు : బతుకమ్మలతో వస్తున్న మహిళలు



శాయంపేట : బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు



వేలేరు : పీచరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఐనవోలు : నిమజ్జనం చేసిన బతుకమ్మలు

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- రోడ్లు వేశారు.. డ్రెయినేజీలు మరిచారు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆత్మకూరు : మండలకేంద్రంతో పాటు మండలంలోని కామారం, తిరుమలగిరితో పాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు వేసి సైడ్ డ్రెయినేజీలు నిర్మించడం మరిచారు. సైడ్ డ్రెయిన్‌లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల మురుగునీరు నిల్వ కావడంతో మురుగునీటిపై దోమలు చేరి ఆవాసాలు ఏర్పర్చుకుంటున్నాయి. గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కావడంతో కనీస మౌళిక వసతులు కల్పించే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల పలువురు విషజ్వరాల బారిన పడినప్పటికి ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో డ్రెయినేజీ నిర్వహణ, తాగునీటి సరఫరా, చెత్త తొలగింపు తదితర అంశాల్లో పర్యవేక్షణ కరువైందని దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు కామారంలో రెండేండ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు మార్గంలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిల్వ ఉంటున్నది. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లి గ్రామాల్లో కనీస వసతులను పరిశీలించి కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు (ఫైల్)



డ్రెయినేజీలు లేక రోడ్డు పక్కనే నిలిచిన మురుగు నీరు

బీజేపీ శ్రేణులపై కేసు కొట్టివేత

పరకాల: బీజేపీ నాయకులపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన అక్రమ కేసులను పరకాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశరత్ కొట్టివేశారు. 2020 సంవత్సరంలో పరకాల మున్సిపల్ ఎన్నికల సమయంలో కొందరు అభ్యర్థులను బీఆర్‌ఎస్ నేతలు బలవంతంగా నామినేషన్లు ఉపసంహరణలు చేయిస్తుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు బీజేపీ నేతలపై కేసు నమోదు చేశారు. బీజేపీ నేతల తరపున సీనియర్ న్యాయవాది గండ్ర నరేశ్‌రెడ్డి వాదించగా జడ్జి వారిపై కేసును కుట్ర పూరితంగా పరిగణిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డిలపై కేసు కొట్టివేశారు. కేసు కొట్టివేతపై పరకాల కోర్టు వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కేసులు నమోదు చేసినా నిజం ఎప్పటికీ గెలుస్తుందనటానికి కోర్టు ఇచ్చిన తీర్పు ఓ సాక్ష్యంగా చెప్పవచ్చని బీజేపీ నాయకులు అన్నారు.



కేసు కొట్టివేతతో హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మహిళలకు గాజులు పంపిణీ చేశారు. విజేతలకు బహుమతులు ప్ర దానం చేశారు. అలాగే మండలకేంద్రంతో పాటు మండలంలోని గుడెప్పాడ్, పెద్దాపూర్ గ్రామాల్లో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో సతీసమేతంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా భక్తి భావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

6న సన్మానం

కేయూ క్యాంపస్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగకు మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులతో గెట్ టుగెదర్‌తో పాటు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేయూ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాడేటి శ్రీనివాస్ తెలిపారు. అక్టోబర్ 6న మధ్యాహ్నం యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం సెమినార్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల కోడ్ అమలులోకి రాగా సోమవారం మండలంలోని 24 గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఫణిచంద్ర ఆదేశించారు. దీంతో మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీ ఫ్లెక్సీలను, బ్యానర్ల మల్టీపర్పస్ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఫణిచంద్ర మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామాల్లో ఎన్నికల నియమావళిని పంచాయతీ కార్యదర్శులు పాటించాలని సూచించారు.



ఫ్లెక్సీలను తొలగిస్తున్న మల్టీపర్పస్ సిబ్బంది

నిమజ్జనాన్ని పరిశీలించిన ఏసీపీ

పరకాల : వరుణదేవుడు కరుణించడంతో సద్దుల బతుకమ్మ వేడుకలు పట్టణంలో ప్రశాంతంగా జరిగాయి. పదేళ్ల కాలంలో ఏనాడు లేని విధంగా మహిళలు రాత్రి 10 గంటల వరకు ఎలాంటి ఆటంకం లేకుండా సద్దుల బతుకమ్మ వేడుకలు సంబురంగా జరుపుకున్నారు. దామెర చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మను నిమజ్జనాన్ని పరకాల ఏసీపీ సతీష్‌బాబు, కమిషనర్ సుష్మ, సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షించారు. చెరువులోకి మహిళలు, పిల్లలను దిగకుండా మున్సిపల్ సిబ్బంది సాయంతో బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా.. ఏంతో ప్రశాంతంగా బతుకమ్మ జరుపుకోవడంపై ఏసీపీ సతీష్‌బాబు, కమిషనర్ సంతోషం సుష్మ వ్యక్తం చేశారు. ప్రశాంతంగా జరుపుకోవడానికి సహకరించిన మున్సిపల్ ఉద్యోగులు, పోలీసు సిబ్బందిని అభినందించారు.



నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీశ్‌బాబు, కమిషనర్ సుష్మ

బతుకమ్మ ఆడాలంటే.. వంతెన దాటాల్సిందే

దామెర: బతుకమ్మ ఆడాలంటే ప్రయాసకోర్చి వంతెన దాటాల్సిందే. మండలంలోని ఊరుగొండ నుంచి పసరగొండకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద చెరువు వద్ద ఉన్న లోలెవల్ వంతెన కొన్ని నెలల క్రితం ధ్వంసమైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం పెరగడం, క్రషర్లకు చెందిన భారీ వాహనాలు ప్రయాణిస్తుండడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సోమవారం ఊరుగొండ గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను పెద్ద చెరువు వద్ద ఆడుకుని చెరువులో వేయడానికి మహిళలు వస్తూ వంతెన వద్ద తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరదతో పాటు గుంతలు ఉండడంతో పలువురు మహిళలు, పిల్లలు ప్రమాదవశాత్తు పడగా స్వల్పగాయాలయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు చర్యలు తీసుకునేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



వంతెన వద్ద ఇబ్బందులు పడుతున్న మహిళలు